క్లుప్తంగా

నైతిక విలువలు పెంపొందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ -2 వెంకటరావు

గంట్యాడ: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని ఎంఈఓ-2 ఎస్.వెంకటరావు సూచించారు. సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని లక్కిడాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆదివారం సుపథ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. శ్లోక పఠనం, పద్య పఠనం, దేశభక్తి గేయాలు, శ్రీమద్రామాయణం ప్రహేళిక, వ్యాసరచన, తెలుగు నేర్చుకుందాం తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 వెంకటరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తున్న సుపథ సంస్థ వ్యవస్థాపకులు యూ.వి.ఏ.ఎస్.రాజు, ఉపాధ్యాయుడు వాక చిన్నంనాయుడు, బి.శేషగిరిరావు,బి. రామప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు అందజేయవచ్చని సూచించారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ట్రెక్కింగ్



ట్రెక్కింగ్‌కు సన్నద్ధమవుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

శృంగవరపుకోట: ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఆదివారం చిలకలగెడ్డ ప్రాంతంలో ట్రెక్కింగ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా యువత క్రమ శిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవరుచుకుంటారని చెప్పారు. ఎన్‌సీసీ ఆఫీసర్ వలీఖాన్ మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పలువురు ఆర్మీ, నేవీ, ఉద్యోగాలు సాధించారని, శారీరక, మానసి క ధృడత్వానికి, క్రమశిక్షణకు ఎన్‌సీసీ ఎంతో దోహదపడుతుందని చెప్పారు. కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్య ప్రదర్శన పోటీలు



ఉత్తమ ప్రదర్శన చేసిన బృందానికి బహుమతులు అందజేస్తున్న సీతం కళాశాల కరస్పాండెంట్ శశి భూషణరావు

బొండపల్లి: సత్యసాయి జయంతి వేడుకల్లో భాగంగా కొవ్వాడపేట గ్రామంలో శనివారం రాత్రి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 36 మహిళలు, బాలికల బృందాలు నృత్యప్రదర్శన చేశారు. వీరిలో ఉత్తమ ప్రదర్శన చేసిన నృత్య బృందాలకు సీతం క ళాశాల కరస్పాండెంట్ మజ్జి శశిభూషణరావు బహుమతులు ప్రధానం చేశారు. దేవుపల్లి రా జరాజేశ్వరీ దేవి ఆలయ అర్చకులు దూసి శ్రీ ధర్, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా వరి కోతలు



కోమటిపల్లిలో యంత్రంతో వరి కోతలు చేస్తున్న రైతు

దత్తిరాజేరు: మండల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. కూలీల కొరత కారణంగా కొంతమంది రైతులు యంత్రాలతో కోత లు చేస్తున్నారు. యంత్రాలను ఉపయోగించడం వల్ల కోతలు వేగంగా జరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు.గతంలో ఎకరా నికి కోత కూలి రూ.4 వేల వరకు ఖర్చయ్యేదని, యంత్రం ద్వారా కోత పనులు చేసేందుకు రూ.2వేల వరకు ఖర్చవుతోందని అంటున్నారు. అయితే వరి కోతలు జోరందుకున్న ఈ సమయంలో వాతావరణ శాఖ చేసిన తుపాను హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉంద ని వాతావరన శాఖ అధికారులు తెలపడంతో ఇప్పటికే కోతలు చేసిన రైతులు పొలాల్లో చేనును కళ్లాలకు తరలించి, కుప్పలు పెట్టే పనిలో బిజీగా ఉన్నారు.

ముందస్తు సస్యరక్షణతో అధిక దిగుబడి

- మామిడి సాగులో సస్యరక్షణ చర్యలకు సమయమిదే
- డిసెంబర్ మూడో వారం నుంచి జనవరి నెలాఖరు వరకు పూత దశ
- పూత బాగా, నాణ్యవంతంగా రావాలంటే యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



దత్తిరాజేరు మండలంలోని షికారుగంజ గ్రామంలో మామిడి తోట

దత్తిరాజేరు: మామిడి పంట దిగుబడి ముందస్తు సస్యరక్షణ చర్యలపైనే ఆధారపడి ఉంటుందని ఉద్యానవనశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గజపతినగరం నియోజకవ ర్గంలోని దత్తిరాజేరు, బొండపల్లి, గజపతినగరం, గంట్యాడ మండలాల పరిధిలో 13,500 ఎకరాల్లో రైతులు మామిడి సాగుచేస్తున్నా రు. ప్రధానంగా బంగినపల్లి, పునరస, కోలంగువ్వ, కలెక్టర్, సువర్ణరేఖ, తదితర రకాలను పండిస్తున్నారు. సాధారణ పరిస్థితుల్లో నవంబర్, డిసెంబర్ మాసాల్లో మామిడి పూత వస్తుంది. అయితే కొన్నేళ్లుగా పూత ఆలస్యమవుతోంది. డిసెంబర్ నెలాఖరులో పూత ప్రారంభమై ఫిబ్రవరి మొదటి వారం వరకు పూత వస్తోంది. చాలామంది రైతులు పూత, పిందె వచ్చాకే తోటలపై దృష్టిపెడతారు. అలాకాకుండా ఇది వరకు వచ్చిన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపడితే సకాలంలో పూత వచ్చి, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాఖ అధికారులు అంటున్నారు. మామిడిలో దిగుబడులు కొంతవరకు వాతావరణం మీద ఆధారపడి ఉన్నప్పటికీ రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం కూడా ముఖ్యమే. కలుపు నివారణ, చీడపీడలు, తెగుళ్ల నివారణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు రావడానికి ఆస్కారం ఉంటుంది. తోటలో కలుపు లేకుండా చూసుకుంటే చాలా వరకు చీడపీడల సమస్య తగ్గుతుంది. చెట్ల మొదళ్లలో కలుపు అస్సలు ఉండకూడదు. ఈసమయంలో యాజమాన్య పద్ధతులు పాటించకపోతే పూత ఆలస్యంగా వచ్చే అవకాశం ఉందని ఉద్యానవన శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

సూక్ష్మపోషకాలు అందించాలి

డిసెంబర్ నెలాఖరులోగా ఏ మైనా అకాల వర్షాలు కురిస్తే తోటల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలి. చెట్ల మొదళ్లలో వర్షపు నీరు ఎట్టిపరిస్థితుల్లోనూ నిల్వ ఉండకూడదు. పూత బాగా రావడానికి పిందెలు నిలవడానికి కాయల నాణ్యత కోసం జింక్, బోరాన్,మాంగనీస్, ఐరన్,వంటి సూక్ష్మపోషకాల మిశ్రమాలను పిచికారీ చేయాలి. జింక్ లోపిస్తే మొక్కల ఆకులు చిన్నవిగా మారి రెమ్మలు ఎదుగుదల మందగిస్తుంది. ఫలితంగా మొక్కలు బలహీన పడతాయి. దీంతో పూత సరిగా రాదు. పూతలో ద్విలింగ పుష్పాలు అధికంగా రావడానికి, పూర్తిస్థాయిలో ఫలదీకరణ జరిగి పిందెలు అధికంగా రావడానికి బోరాన్ దోహదపడుతుంది.బోరాన్ లోపించిన చెట్లలో పిందెలు రాలడం, కాయలపై బొడిపెలు రావడం, పగుళ్లు ఏర్పడడం వంటి లక్షణాలతో కాయల నాణ్యత దెబ్బతింటుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

మంచి దిగుబడులు సాధించేందుకు మామిడి రైతులు ఇప్పటి నుంచే యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అకాల వర్షాలు కురిస్తే తోటలో నిలిచిన వర్షం నీటిని బయటకు పంపించాలి. బోర్డియాక్ మిశ్రమాన్ని చెట్టు మొదళ్లకు కింద నుంచి రెండు అడుగుల ఎత్తులో పూయాలి. తెగుళ్లు, పురుగుల ఉధృతి నివారణకు లీటర్ నీటికి మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, రెండు గ్రాముల కార్బండెజిం మిశ్రమాన్ని కలిపి పిచికారీ చేయాలి

– రాజశేఖర్, ఉద్యానవన శాఖ అధికారి, గజపతినగరం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

చీపురుపల్లి: పట్టణంలోని వంగపల్లిపేట రైతుసేవా కేంద్రం(రైతు భరోసా కేంద్రం) వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు పండించిన వరి పంటను రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. సాధారణ రకం ధాన్యం క్వింటాల్ ధర రూ.2,300, ఏ గ్రేడు రకం రూ.2,360కు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు పంటను ఎక్కడైనా అమ్ముకునే విధానం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే రైతుల కోసమే ఆర్‌ఈసీఎస్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరామని స్పష్టం చేశారు. కూటమి నాయకులు కె.త్రిమూర్తులురాజు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, గవిడి నాగరాజు, ఇప్పిలి నీలకంఠం, విసనగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాల్సిందే..

- ఎమ్మెల్సీ రఘురాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

జామి: స్థానిక సంస్థల ప్రతినిధులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు సరైన గౌరవం దక్కాల్సిందేనని ఎమ్మెల్సీ రఘురాజు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు నేతృత్వంలో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి తమకు అధికారుల నుంచి ఎప్పుడూ సరైన సమాచారం అందడం లేదన్నారు. తమ ఆమోదం లేకుండానే నిధుల కేటాయింపులు, ప్రతిపాదనలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు గౌరవం దక్కకపోతే తాను ఏ పోరాటానికైనా సిద్ధమన్నారు. ఎంపీపీ ఎస్.అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు సరయు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఏవైనా ప్రజాప్రతినిధులుగా ప్రజల ఆమోదంతో గెలిచిన వారికి ప్రతి సమాచారం అందివ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇకపై ఈ తరహా ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని జి.అగ్రహారంలో ముత్యాలమ్మ ఆలయం ఆవరణలో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప సన్నిదానం వద్ద రూ.1.20లక్షల మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, నాయకులు కొమ్ము చిరంజీవి, ముల్లు పైడిరాజు, కర్రోతు ప్రసాద్, రౌతు పైడిరాజు, బూరాడ మహేష్, ప్రభాత్ పాల్గొన్నారు.



గరివిడి ఆర్‌ఓబీ కింద అధ్వానంగా ఉన్న తారురోడ్డు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి పట్టణంలోని రోడ్లు గోతులతో ప్రమాదకరంగా మారాయి. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం తప్పదని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి కిందన రైల్వే ట్రాక్‌కు రెండు వైపుల ఉన్న తారురోడ్డు గోతులతో పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ఈ రోడ్డు మీదుగానే ఎక్కువగా రాకపోకలు జరుగుతుంటాయి. కిరాణా, వస్త్ర, మెడిక్ దుకాణాలు ఎక్కువగా ఉండడంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అలాగే ఫేకర్ పరిశ్రమకు రాకపోకలు సాగించే భారీ వాహనాలు కూడా ఈ రోడ్డుమీదుగానే వెళ్తుంటాయి. దీంతో రోడ్డుపై ఎక్కడబడితే అక్కడ గుంతలు ఏర్పడడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే మరికొన్ని రోడ్లు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రహదారికి మరమ్మతులు చేట్టాలని పలువురు కోరుతున్నారు.

కొప్పల వెలమల అభివృద్ధికి పాటుపడాలి



శైలేష్‌ను సన్మానిస్తున్న నాయుడుబాబు, తదితరులు

- రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాయుడుబాబు

విజయనగరం ఫోర్ట్: వెలమల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు అన్నారు. ఆదివారం స్థానిక మంచుకొండ వారి మామిడి తోటలో కొప్పల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెలమ బంధువుల కార్తీక వన సమారాధన జరిగింది. ఈ సందర్భంగా 10వ తరగతిలో 598 మార్కులు సాధించిన తొత్తడి శైలేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ హోదాల్లో ఉన్న వారు పేద వెలమ కులస్తులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కొప్పల వెలమ సంక్షేమ సంఘ నాయకులు, డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, బొత్స వరప్రసాద్, చలుమూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి బీచ్‌కు పోటెత్తిన పర్యాటకులు

సముద్రంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు



పూసపాటిరేగ: కార్తీకమాసం నాలుగవ ఆదివారం కావడంతో పూసపాటిరేగ మండలంలోని చింతపల్లిబీచ్‌కు పర్యాటకులు పోటెత్తారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చి చింతపల్లిబీచ్‌ను సందర్శించారు. చింతపల్లిరేవులో సముద్ర స్నానాలు ఆచరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్, చింతపల్లి మెరైన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై వి. శ్రీనివాసరావులు బందోబస్తు నిర్వహించారు. ముందుగా గోవిందపురం ముక్తిధాం క్షేత్రాన్ని పర్యాటకులు సందర్శించి పూజలు చేశారు.

సందడిగా కార్తీక వనసమారాధనలు



శృంగవరపుకోట: వాసవీ క్లబ్‌ల నేతృత్వంలో నిర్వహించిన వన సమారాధనకు హాజరైన ఆర్యవైశ్యులు



శృంగవరపుకోట: సంక్షేమ వనసమారాధనకు హాజరైన కాపు,తెలగ నాయకులు

శృంగవరపుకోట: మండలంలోని పుణ్యగిరితో పాటు పలు గ్రామాల్లో ఆదివారం కార్తీక వనసమారాధనల సందడి కనిపించింది.బొడ్డవర, పెదఖండేపల్లి, కిల్తం పాలెం పంచాయతీల పరిధిలోని కాపులు, తెలగ కులస్తుల వనభోజనాలు రాజీపేట గ్రామంలోని చిన్నయ్య చెరువు కళ్లాల వద్ద కాపు-తెలగ సంక్షేమ సంఘం నేతృత్వంలో నిర్వహించారు. ఆయా కులాలకు చెందిన సుమారు 1500 మందితో పాటు పలు పార్టీల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరయ్యారు. ఈసందర్భంగా పిల్లలు, మహిళలకు ఆటలు, పాటలు, నృత్య పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

వాసవీ క్లబ్‌ల నేతృత్వంలో..

మండలానికి చెందిన ఆర్యవైశ్యులు వాసవీ క్లబ్‌ల నేతృత్వంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వనసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కుసు మంచి సుబ్బారావు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వైశ్యులకు ఆర్యవైశ్య మహాసభ అండగా ఉంటుందన్నా రు. చిరువ్యాపారులకు రుణసహాయం అందించి వారి ఎదుగుదలకు తోడ్పాటు ఇస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్య క్షుడు తవ్వా మోహన్, నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిపులుసు ఈశ్వరరావు, ఐదు మండల నాయకులు పాల్గొన్నారు.



గుర్ల: ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఉపాధ్యాయుల వనమహోత్సవం

గుర్ల: మండల ప్రభుత్వ ఉపాధ్యాయుల కార్తీక వన మహోత్సవాన్ని మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక దత్త ఎస్టేట్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఎంఈఓ ఎస్.భానుప్రకాష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి. సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, నాయకుడు బెల్లాన బంగారునాయుడు బహుమతులు అందజేశారు. అనంతరం వనభోజనాలు చేశారు. ఆటలపోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

గజపతినగరం: మండలంలోని పాతబగ్గాం గ్రామంలో గ్రామ సచివాలయం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నూతన భవనాలను రాష్ట్రచిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎన్నారై సాధికారత శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం సాయంత్రం ప్రారంభించనున్నారని ఎంపీడీఓ బి.కల్యాణి ఆదివారం ఓ ప్రకనటనలో తెలిపారు. అంతకు ముందు మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఆలయ కమిటీల్లో విశ్వబ్రాహ్మణులకు స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల శ్రీనివాసరావు

డెంకాడ: ఆలయ కమిటీల్లో విశ్వ బ్రాహ్మణులకు చోటు కల్పించాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని చింతలవలసలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించి విశ్వ బ్రాహ్మణులను విస్మరించడం బాధాకరమన్నారు. విశ్వబ్రాహ్మణులకు చట్ట సభల్లో కూడా తగిన స్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సన్యాసిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుగంధం నాగమల్లేశ్వరరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు కోసూరి విజయ్‌భాస్కరరావు, జిల్లా నాయకులు ఆవుపాటి నాగభూషణరావు, కోసూరి రాంబాబు, ఉమామహేశ్వరరావు, ఉమాపతి, సోమశేఖర్, సంఘ నాయకులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

☛ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవం..

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘ జిల్లా నూతన శాఖ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందని రాష్ట్ర నాయకులు ప్రకటించారు. సంఘ జిల్లా అధ్యక్షుడిగా కాకినాడ ఉమామహేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులుగా అప్పరభట్ల నరసింహారాజు, ఆవుపాటి నాగభూషణం, కన్వీనర్‌గా కోసూరి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా వదురుపర్తి గీత సత్యఉమాపతి, కోశాధికారిగా మంతెన అప్పలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శంభాన లక్ష్మణరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కెల్ల సోమశేఖర్ ఎన్నికయ్యారని తెలిపారు.

రైతు కష్టం నేలపాలు

- కోత సమయంలో వరి పంటను ఆశిస్తున్న రెల్లరాల్చు పురుగు
- రెక్క విరిగి రాలిపోతున్న ధాన్యం



లచ్చింపేటలో రెల్లరాల్చు పురుగు కత్తిరించడంతో రాలిపోయిన వరి కంకులు

లక్కవరపుకోట: వరి నారు పోసిన నాటి నుంచి నాట్లు వేసి కోత చేసే వరకు రైతులను ఏదో ఒక సమస్య వెంటాడుతునే ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో తగిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో నాట్లు వేయడం ఆలస్యమైంది. కొన్ని చోట్ల రైతులు ముదిరిన నారుతోనే ఉభాలు చేశారు. ఆతర్వాత నీటి ఎద్దడి, వాతావరణ మార్పుల వల్ల పంటను ఆశించిన తెగుళ్ల నివారణకు పురుగు మందుల కోసం వేల రూపాయలు ఖర్చు పెట్టారు. నానా అవస్థలు పడి పంటను కాపాడుకుంటూ వచ్చిన రైతులను రెల్లరాల్చు పురుగు నిలువునా ముంచేస్తోంది. పంట కోత దశలో ఈ పురుగు ఉధృతి ఎక్కువగా కనిపిస్తోంది.ఈ పురుగు వరి కంకులను కొరికేస్తుండడంతో 20 శాతానికి పైగా ధాన్యం పొలంలోనే రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. లచ్చింపేట, చందులూరు,శ్రీరాంపురం తదితర గ్రామాల వ్యవసాయ క్షేత్రాల్లో ఈ పురుగు ఎక్కువగా కనిపిస్తోంది. నివారణకు 2.5 మిల్లీ లీటర్ల క్లోరిపైరిఫాస్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని, ఎకరానికి 500 మిల్లీలీటర్ల మందును వాడాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.అలాగే మోనోక్రోటోపాస్, ఎసిఫేట్ వంటి మందులను పిచికారీ చేసుకోవచ్చని అంటున్నారు. రెల్ల రాల్చు పురుగు ఉదయం పూట వరిదిబ్బల మొదళ్లలో దాక్కొని సాయంత్రం చీకటి పడిన తర్వాత కంకుల మీదకు వచ్చి వరి రెక్కలను కత్తిరించేస్తుందని, పురుగు మందులను సాయంత్రం పూట పిచికారీ చేసుకుంటే మంచిదని వ్యవసాయ సిబ్బంది సూచిస్తున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

- విపక్ష నాయకులు

నెల్లిమర్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని విపక్ష నాయకులు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక మొయిద జంక్షన్‌లోన్ విపక్షాలు కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా తెలిపాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కిల్లంపల్లి రామారావు, కనకల రాము.. ఏఐటీయూసీ నాయకుడు మొయిద పాపారావు.. ఐఎఫ్‌టీయూ నాయకుడు కళ్ల అప్పలసూరి, ఐఎన్‌టీయూసీ నాయకుడు కనక పద్మనాభం మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయడంతో పాటు నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులతో కుమ్మక్కై కార్మిక హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. ఇప్పటికే నెల్లిమర్ల జూట్ మిల్లుతో బాటు మండలంలో సుమారు 31 పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. దీంతో సుమారు 30 వేల మంది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మూతపడిన పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా సౌరశక్తి విద్యుత్ ఒప్పందాల్లో అవినీతికి పాల్పడిన అదానీని తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు.